## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



అంజయ్య కుటుంబానికి చెక్కును అందిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

చేగుంట, మే 2: కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నార్సింగి మండలం నర్సంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అంజయ్యకు ఇటీవల మృతిచెందగా పార్టీ నుంచి కుటుంబానికి శుక్రవారం రూ.2 లక్షల చెక్కును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, నార్సింగి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైలరాంబాబు, మంచికట్ల శ్రీనివాస్, భాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద టైలర్స్ అసోసియేషన్ నాయకుడు భోగరాజు సుగుణ దంపతుల మనుమరాలు పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## బీఆర్‌ఎస్ యువ నాయకుడు మృతి



ముస్తఫా మృతదేహానికి నివాళులర్పిస్తున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట, మే 2: మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముస్తఫా (30) నాలుగు రోజుల క్రితం శ్వాస సంబంధ సమస్యతో బాధపడగా కుటుంబీకులు కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ ముస్తఫా ఆరోగ్యం మరింత దిగజారడంతో మెరుగైన చికిత్స అందించడం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించినా ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ విషమించి శుక్రవారం ఉదయం మృతిచెందాడు. బీఆర్‌ఎస్ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేసిన ముస్తఫా మరణ వార్త విన్న పార్టీ కార్యకర్తలు శోకసంద్రంలో మునిగారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నిజాంపేటలో ముస్తాఫా మృతదేహానికి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల, గ్రామ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ కో-అప్షన్ సభ్యులు అబ్దుల్ ఆజీజ్, గౌస్, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, నాయకులు కిష్టారెడ్డి, రాజు, రాములు, తిరుమల్, మహేశ్, వెంకటస్వామి, వెంకటస్వామిగౌడ్, తిరుమల్‌గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

## హరితహారం తెచ్చిన ఆహ్లాదమిది



జోగిపేట-నర్సాపూర్ వెళ్లే దారిలో రంగురంగుల పూల మొక్కలు

చిలిపిచెడ్,మే 2 : బీఆర్‌ఎస్ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. అప్పట్లో నాటిన మొక్కలు నేడుగా చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండలంలో రోడ్లకు ఇరువైపులా నాటిన హరితహారం మొ క్కలు నీడను, స్వచ్ఛమైన గాలితో పాటు పూ లను ఇస్తున్నారు. వాహనదారులు, ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండలంలో చిట్కుల్ గ్రామం నుంచి మెదక్ వెళ్లే దారిలో బద్రియా తండా వరకు, చండూర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ వెళ్లే దారిలో గంగారం వరకు హరితహారం కార్యక్రమంలో భాగంగా పలు విడతల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. చండూర్ చౌరస్తా నుంచి అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు పెంచుతున్నారు. ప్రతి మొక్కకూ నీరు పోసి మొక్కలను సంరక్షించారు.

## బీహారు వలస కార్మికుడు అదృశ్యం

తూప్రాన్, మే 2ః ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన పసుపులేటి సుబ్రమణికి నర్సంపల్లి శివారులో కొంత ఇంటి స్థలం ఉంది. ఫాంహౌస్ కట్టుకోవడానికి కావాల్సిన వస్తువులతో పాటు, ఓ లేబర్ సప్లై కంపెనీకి చెందిన బీహారుకు చెందిన 12 మంది లేబర్‌ను రప్పించారు. వచ్చిన లేబర్ పనులు చేసుకుంటూ అక్కడే తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో అందులో ఒకరైన దేవేంద్ర భగవత్ (39) ఈనెల 1న కల్లుతాగి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ రాకపోయేసరికి అతనికి ఫోన్ చేయగా, స్విఛాఫ్ అని రావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ దొరక్క పోయేసరికి తూప్రాన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్థల యజమాని పసుపులేటి సుబ్రమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బీహారు వాసి ఆత్మహత్య

చేగుంట, మే 2: భార్య కాపురానికి రావడం లేదని బీహారు వాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండల కేంద్రంలోని జీవికా పరిశ్రమలో చోటుచేసుకుంది. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. బీహారు రాష్ట్రంలోని వైశాలి జిల్లా బజీద్‌పూర్‌కు చెందిన నందులాల్ చౌదరి(28) కొన్ని రోజులుగా జీవికా పరిశ్రమలో లేబర్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం ఇతనికి పెండ్లి అయింది. అప్పటి నుంచి భార్య కాపురానికి రావడం లేదు. మనస్తాపంతో శుక్రవారం తాను ఉంటున్న గదిలోనే నందులాల్ చౌదరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- మెదక్ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

మెదక్, మే 2 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 24గంటల ధర్నా నిర్వహించారు. దివ్యాంగుల సంఘం ప్రతినిధులతో అడిషనల్ కలెక్టర్, డీడబ్ల్యువో సమక్షంలో చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాను ఉద్దేశించి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, మెదక్ జిల్లా అధ్యక్షులు ముత్యాలు, కార్యదర్శి కె.యశోద మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని, స్థలం ఉన్న దివ్యాంగులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించి, సాధారణ లబ్ధిలో 25 శాతం అదనంగా ఇవ్వాలనే 2016 ఆర్‌పీడీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2010 నుంచి పింఛన్ పొందుతున్న ప్రతి దివ్యాంగుడికి ఐడీఐడీ కార్డు పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు.ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులతో ప్రత్యేకంగా శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు జారీ చేసి 150 రోజులు పని కల్పించాలని, సహాయ పరికరాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 5శాతం దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని అడిషనల్ కలెక్టర్ మెంచు నగేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని అడిషనల్ కలెక్టర్ దివ్యాంగులకు హామీ ఇచ్చారు. ఆందోళనలో జిల్లా ఉపాధ్యక్షులు టి.యాదగిరి, కవిత, కిష్టయ్య, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, దుర్గ, సామెందర్, కిష్టయ్య, మెదక్ పట్టణ కన్వీనర్ శ్రీదేవి, కో కన్వీనర్ మున్నా, వెంకట్, మునీర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులపై అవగాహన కల్పించాలి



విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 2: పదోతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత తరగతులు చదివేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, గణాంక అధికారి నవీన్, ఎంఈవోలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంఈవోలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇంటర్ ఫలితాలు మెరుగుపడేలా ఈసారి తగిన సూచనలు, సలహాలు అధ్యాపకులు అందించారని కొనియాడారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌లో ప్రవేశాలు పొందేలా, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన వారిని డిగ్రీతో సమానమైన వాటిలో ప్రవేశాలు పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఉన్నత చదువుల నిమిత్తం తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ టాపర్లను కలెక్టర్ శాలువాలతో సత్కరించారు.



ఇంటర్ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన కలెక్టర్

## మిషన్ భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతులు

చిలిపిచెడ్, మే 2: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చిట్కుల్‌లో వాటర్ ట్యాంక్ వద్ద మురుగుతో నీటి కలుషితం జరిగే ప్రమాదం ఉందని, పైపులైన్ ఏ మాత్రం లీకేజీ అయినా మంచి నీరు కలుషితమై గ్రామస్తులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని బుధవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో సాయిబాబా, మండల అధికారులు స్పందించి వాటర్ ట్యాంకుకు ఇచ్చిన మిషన్ భగీరథ నీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేయించారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

## ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోండి

రామాయంపేట, మే 2: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనవారు పనులు ప్రారంభించాలని రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ సూచించారు. శుక్రవారం రామాయంపేట మండలం సుతారిపల్లిలో లబ్ధిదారులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలో 363 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. దామరచెర్వులో 97 ఇండ్లు మంజూరు కాగా, అందులో కేవలం ఆరుగురు మాత్రమే బేస్‌మెంట్ వరకు నిర్మించారని, వారికి మొదటి బిల్లు లక్ష రూపాయల చొప్పున అందజేసినట్లు తెలిపారు. సుతారిపల్లిలో కూడా పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు.

## టాపర్‌కు సన్మానం

రామాయంపేట, మే 2: రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామానికి చెందిన ప్రశాంతి పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. 600 మార్కులకు 560 సాధించి ఆమె మండల టాపర్‌గా నిలిచి సత్తాచాటింది. పేద కటుంబంలో పుట్టనప్పటికీ మంచి మార్కులు సాధించడంతో శుక్రవారం గ్రామస్తులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశాంతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

# పారదర్శకంగా ధాన్యం కొనాలి



రామాయంపేటలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కల్లాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

రామాయంపేట, మే 2: కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం కాంటా వేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రజినీకుమారి ఆదేశించారు. శుక్రవారం రామాయంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. తూకాల్లో మోసాలు జరగవద్దని, రైతులకు మద్దతు ధర చెల్లించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురు స్తున్నందున ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ గౌస్ తదితరులు ఉన్నారు.

**ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలి**

నర్సాపూర్, మే 2: ధాన్యాన్ని త్వరగా రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకోవాలని రైస్‌మిల్లర్లకు తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో సాయికృష్ణ రైస్‌మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని లారీల్లో లోడ్‌చేసి రైస్‌మిల్లులకు త్వరగా పంపించాలని, ఆలస్యం జరుగకుండా చూసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం**

రేగోడ్, మే 2: మండల కేంద్రం రేగోడ్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ దత్తారెడ్డితో కలిసి ఎంపీడీవో సీతారావమ్మ, ఏవో జావిద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజుయాదవ్, శ్యాంరావు కులకర్ణి ప్రారంభించారు. అధికారులు మాట్లాడుతూ.. రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. క్వింటాల్ జొన్నలకు రూ.3371 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో జావిద్, ఆర్‌ఐ ఫిరోజ్, మాజీ జడ్పీటీసీ యాదగిరి, ఏఎస్సై మల్లయ్య, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ రాధాకిషన్ పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో రైస్‌మిల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



రేగోడ్ సొసైటీ వద్ద జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన తహసీల్దార్

## దుర్గమ్మను దర్శించుకున్న ఆర్డీవో రమాదేవి



అమ్మవారి సన్నిధిలో ఆర్డీవో రమాదేవి

పాపన్నపేట, మే 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాతను మెదక్ ఆర్డీవో రమాదేవి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆర్డీవోకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## నేడు శ్రీనివాస పద్మావతి కల్యాణం

మెదక్ మున్సిపాలిటీ, మే 2: మెదక్ జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 11.45 గంటలకు శ్రీనివాస-పద్మావతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్ శుక్రవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## నేడు రేగోడ్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు

రేగోడ్, మే 2: తెలంగాణలో ఏకైక బ్రహ్మంగారి మఠంగా విరాజిల్లుతున్న రేగోడ్‌లోని బ్రహ్మంగారి మఠంలో నిర్మించిన ఆలయానికి పున: శిఖర, ధ్వజస్తంభం, లింగం, నంది, కాలభైరవుడు, శరబాక లింగమయ్య, నాగులు, బలిపీఠం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శివకుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాదుకలు, ఓంకార జెండా వందనం, ఫలహార బండ్ల ప్రదర్శన, మహానైవేద్యం, అన్నప్రసాద వితరణ, రథోత్సవం, బైలు నాటకాలు జరుగుతాయని తెలిపారు.

## కుక్కల దాడిలో జింక మృతి



మృతిచెందిన జింకను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నిజాంపేట, మే 2: కుక్కల దాడిలో జింక మృతిచెందిన సంఘటన చల్మెడ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సంతోశ్‌రెడ్డి మామిడి తోటలో జింకను కుక్కలు వెంటపడి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటనలో జింక ప్రాణాలు కోల్పోయింది. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, నిజాంపేట ఏఎస్సై జైపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా చేశారు.

## ఎంఈవోకు సన్మానం

చేగుంట, మే 2: నార్సింగి మండల విద్యాధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన కె.గంగబాయికి పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చేగుంట, మే 2: గంజాయి, డగ్స్, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని కళాకారులు సూచించారు. చేగుంట మండలం పులిమామిడిలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల చేత కళా ప్రదర్శన ఇచ్చి గ్రామస్తులను చైతన్యపరిచారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై ఆటపాటల ద్వారా కళాకారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీమ్ కోర్డినేటర్ శివొల్ల కృష్ణ, బండారు నర్సయ్య, ఆస రామారావు, ఎల్లయ్య, దేవదాసు, నర్సయ్య, సిద్దులు, ఎల్లయ్య, శేఖర్, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట, మే 2: మండలంలోని ఎల్లాపూర్ గ్రామ శివారులోని మంజీరా నదిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 35 నుంచి 40 ఏండ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఎల్లాపూర్ శివారులోని మంజీరా నదిలో తేలియాడుతుంగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం ఒంటిపై నలుపు నీలం రంగు ప్యాంటు ఉంది. రెండు మూడు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. సంబంధీకులు 8712657920లో సంప్రదించాలని సూచించారు.

# సమ్మర్ క్యాంపుల్లో ఉచిత శిక్షణ

చేగుంట, మే 2: సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చేగుంట, నార్సింగి మండల విద్యాధికారులు నీరజ, కె.గంగాబాయి సూచించారు. చేగుంట, నార్సింగిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో శుక్రవారం సమ్మర్ క్యాపులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉదయం 8గంటల నుంచి 11 వరకు యోగా, కంప్యూటర్, కుట్లు, అల్లికలు, ఆటలపై శిక్షణ ఉంటుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు కోరారు. కార్యక్రమాల్లో కరణం శ్రీదేవి, గిరిదయాళ్, గీత, రేణుక, నార్సింగిలో వెంకటేశ్వరశర్మ, స్వామి, శశికళ, సుస్మిత, ఎంఆర్సీ బాలాగౌడ్, సయ్యాజి, నవీన, దావూద్ తదితరులు పాలొన్నారు.

**రామాయంపేటలో సమ్మర్ క్యాంపు**

రామాయంపేట, మే 2: రామాయంపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఎంఈవో అయిత శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు భరత్‌కుమార్ విద్యార్థులకు యోగా నేర్పించారు. ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగాతో పాటు డ్రాయింగ్, కరాటే తదితర వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు 15రోజుల పాటు ఉదయం 8 నుండి 11గంటల వరకు కొనసాగుతుందని, 15 రోజుల పాటు జరిగే శిక్షణకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విధిగా పాల్గొనాలని కోరారు.

**సమ్మర్ కాంపునకు విశేష స్పందన**

పాపన్నపేట, మే 2: పాపన్నపేటలో యంగ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన సమ్మర్ క్యాంపునకు మొదటి రోజు విశేష స్పందన వచ్చిందని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో 15రోజుల పాటు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆటపాటలతో సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, సమ్మర్ క్యాంపు ఇన్‌చార్జి నాగరాజు మాట్లాడుతూ.. శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, అనిల్, రమేశ్, సీఆర్పీలు నవాజ్‌రెడ్డి , మహేశ్వరి, సత్యనారాయణరెడ్డి, రాజశేఖర్, సౌందర్య, ఇన్‌స్ట్రక్టర్లు గజేంద్ర, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి**

నర్సాపూర్, మే 2: విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి తారాసింగ్ సూచించారు. నర్సాపూర్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారం, పెన్నులు, నోటుబుక్కులు అందిస్తామని తెలిపారు. హెచ్‌ఎం విఠల్, పండరి, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, ఉపాధ్యాయులు పెంటయ్య, రవిరాజ్, సీఆర్పీలు భైరవరెడ్డి, నరసింహాచారి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.




పాపన్నపేట: సమ్మర్ క్యాంపు ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, క్యాంపు ఇన్‌చార్జి నాగరాజు




చేగుంట: నార్సింగిలో అవగాహన ర్యాలీలో ఎంఈవో గంగబాయి, అధికారులు, విద్యార్థులు




నర్సాపూర్ : శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులతో ఎంఈవో తారాసింగ్